# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
4-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి:16
సంచిక: 132

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# గ్రేటర్ రోడ్లు చూతం రారండి!



ఏ రహదారి చూసినా గోతుల భయమే

భాగ్యనగరవాసులను చికాకు పెడుతున్న రోడ్లు

పట్టించుకోని నగరపాలక సంస్థ

ఇలా అయితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: చెరువులను తలపిస్తున్న వైనం.. హైదరాబాద్ నగరంలో చిన్న వర్షం పడితే చాలు.. గుంతలు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. గుంత ఎక్కడుందో తెలియక నిత్యం వందలాది మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు ధ్వంసమై సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలో ట్రాఫిక్ నిలిచిపోవడానికి..

- మిగతా 3వ పేజీలో

హైదరాబాద్ గ్లోబల్ సిటీ.. మెగా ఐటీ హబ్.. అని ప్రచారం చేసుకుంటే.. రహదారుల పరిస్థితి మాత్రం నానాటికి తీసికట్టుగా మారుతోంది. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వ కారణం అన్నట్టు పరిస్థితి ఉంది. గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని ఈ ప్రధాన రహదారి చూసినా గోతులు అనేవి సర్వసాధారణం అయిపోయాయి. భాగ్యనగరంలోని ఏ వీధికి వెళ్ళినా సగటు ప్రయాణికుడి నోట వినిపిస్తున్న ఆవేదన కూడా అదే. వర్షంతో సంబంధం లేదు. కురిసినా, కురవకపోయినా ప్రయాణం మాత్రం నరకప్రాయం. అదే గుంతలు మళ్లీమళ్లీ చూపుతూ అధికారులకు విన్నవించుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. నగర రహదారులు మాత్రం ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి.

## విజయసాయిరెడ్డి యూటర్న్!



వైసీపీలోకి రీ ఎంట్రీ

జగన్ గ్రీన్ సిగ్నల్

ఉభయ వర్గాల మధ్య కీలక చర్చలు

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రస్తుతం డిజిటల్ మీడియాను సిద్ధం చేసిన ఆయన.. తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ కావాలన్నా ఆలోచనతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని.. అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తున్నారని..

- మిగతా 2వ పేజీలో

ఏపీలో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకునే అవకాశం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి సీనియర్ నేత విజయసాయిరెడ్డి తిరిగి చేరే ఛాన్స్ కనిపిస్తోంది. త్వరలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తానని విజయసాయిరెడ్డి ప్రకటించారు. తాజాగా మరోసారి అటువంటి ప్రకటన చేశారు.

2లో




## 'హైడ్రా' మోదమా? ఖేదమా?

మెజారిటీ ప్రజల ఆశాకిరణం గా ఈ వ్యవస్థ

ప్రజావాణి వేదికకు భారీగా బాధితులు, ఫిర్యాదుదారులు

వ్యతిరేకిస్తున్న ఆక్రమణదారులు, ప్రతిపక్షాలు

నిరుపేదల విషయంలో తప్పులు సరిదిద్దుకుంటే

గొప్పవ్యవస్థగా మారే అవకాశం

తెలంగాణ రాజకీయం ఇప్పుడు హైడ్రా చుట్టూనే నడుస్తోంది. ఆ వ్యవస్థ పై ప్రతిపక్షాలు, బాధితులు విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం హైడ్రా పై అనుకూల వాతావరణం అధికంగా ఉంది. హైడ్రా వారం వారం నిర్వహిస్తున్న ప్రజావాణి వేదికకు ఫిర్యాదుదారులు వేల సంఖ్యలో క్యూ కడుతున్నారు. ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నట్టు హైదరాబాద్ తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉంటే.. ప్రజలు పదే పదే తమ సమస్యల పరిష్కారం కోసం ఈ వ్యవస్థని ఎందుకు ఆశ్రయిస్తున్నారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఇప్పుడు తెలంగాణలో మిలియన్ డాలర్ల ప్రశ్న కూడా ఇదే. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణికి వేల ఫిర్యాదులు వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్లియర్ చేసేందుకు

- మిగతా 2వ పేజీలో



## భూమా ఫ్యామిలీలో వార్!

ఆళ్లగడ్డ అసెంబ్లీ టికెట్ కోసం గట్టి పోటీ

సిట్టింగ్ ఎమ్మెల్యేగా అఖిల ప్రియ

పార్టీ కార్యక్రమాలను ఒంటరిగా చేస్తున్న కుమారుడు జగత్ విఖ్యాత్ రెడ్డి

మరోవైపు పోటీకి సిద్ధమంటున్న అఖిల ప్రియా రెడ్డి

3లో



## జొన్న రైతులకు శుభవార్త

రూ. 994 కోట్ల బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ



## రాజకీయాలకు చిరు శాశ్వత దూరం!

ఏపీ ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్ నియామకం వదంతు

అభిమానులు నమ్మవద్దు

మెగాస్టార్ టీం ప్రత్యేక విజ్ఞప్తి

## అగ్రిగోల్డ్ బాధితులకు శుభవార్త!

వచ్చేనెల 15లోగా తొలి దశ చెల్లింపులు

భూములు వేలం వేసి చెల్లించేలా ఏర్పాట్లు

రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న ఏపీ ప్రభుత్వం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** అగ్రిగోల్డ్ బాధితులకు ఉపశమనం. బాధితులకు న్యాయం చేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అగ్రిగోల్డ్ భూములను బహిరంగ వేలం వేసి..

2లో

## తెలంగాణ టూ ఏపీ!


తెలుగు రాష్ట్రాలకు విస్తరించిన ఫోన్ ట్యాపింగ్ కేసు

ఆంధ్రప్రదేశ్లో సైతం బాధితులు

స్నేహితుడి కోసం అప్పటి గులాబీ పెద్దల సమాచార సహకారం

సిట్ దర్యాప్తులో సంచలనాలు

3లో



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ఫోన్ టాపింగ్ కేసు ప్రకంపనలు రేపింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ టాపింగ్ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. అంతే సీరియస్ గా దర్యాప్తు జరుగుతోంది.



# ‘హైడ్రా’ మోదమా? ఖేదమా?



(మొదటి పేజీ తరువాయి)

కొన్ని వారాల పాటు ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేయాల్సిన దుస్థితి వచ్చింది. అంటే హైడ్రా వ్యవస్థకు ఏ స్థాయిలో ఆదరణ ఉందో ఇట్టే చెప్పవచ్చు.

**రేవంత్ ప్రతిష్టాత్మకంగా..**

రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది హైడ్రావస్థను. అయితే ఇది ప్రారంభమైన నాటి నుంచి వివిధ మాధ్యమాల ద్వారా వచ్చిన దరఖాస్తులు 20 వేలకు పైమాటే. కేవలం ప్రజావాణి ద్వారానే వేలాది ఫిర్యాదులు నేరుగా అధికారుల ముందుకు వచ్చాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఆస్తులపై కబ్జాదారుల దౌర్జన్యం, చెరువుల ఎఫ్.టి.ఎల్ పరిధి ఉల్లంఘనలు, నాలాల మూసివేత, రోడ్ల ఆక్రమణలు వల్ల తీవ్రంగా నష్టపోతున్న సాధారణ పౌరులకు హైడ్రా ఒక ఆశా కిరణంగా కనిపిస్తోంది. ఏళ్లుగా జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా పరిష్కారం కానీ పబ్లిక్ లేఅవుట్లు, పార్కుల ఆక్రమణల వివాదాలు హైడ్రా జోక్యంతో గంటల వ్యవధిలో పరిష్కారం అవుతున్నాయి. అందుకే ఈ వ్యవస్థను ప్రజలు ఎక్కువగా నమ్ముతున్నారు.

**నిరుపేదలే బాధితులు..**

అయితే ఈ ప్రతిష్టాత్మకమైన వ్యవస్థకు ప్రజామోదం ఒకవైపు ఉంటే... బాధితుల భయాలు, చట్టపరమైన విమర్శలు మరోవైపు బలంగా ఉన్నాయి. నాలాతోపాటు చెరువుల వద్ద దశాబ్దాలుగా నివసిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు హైడ్రా బుల్డోజర్లు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. హైడ్రా తీసుకుంటున్న ఏకపక్ష కూల్చివేతల నిర్ణయాలు, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తీసుకుంటున్న చర్యలపై న్యాయస్థానాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కోర్టు కేసులు పెరుగుతుండడం, అదే స్థాయిలో ధిక్కరణ కేసులు నమోదవుతుండడంతో.. ఈ వ్యవస్థ పై ప్రతికూల కోణాన్ని చూపుతున్నాయి. బిల్డర్లతో పాటు ఆక్రమణదారులు నష్టపోతుంటే పరవాలేదు కానీ.. నిరుపేదలు ఎక్కువగా నష్టపోతుండడం ఈ వ్యవస్థ పై విమర్శలు పెరగడానికి కారణం.

**విమర్శలు సర్వసాధారణం..**

ఇటువంటి సాహసోపేతమైన చర్యలకు దిగుతున్న హైడ్రావ్యవస్థపై విమర్శలు రావడం అనేది సర్వసాధారణం కూడా. చెరువులు,, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుకునే నగరవాసులు.. వరద భయాలనుంచి హైదరాబాద్కు ముక్తి కలగాలని ఆశించే కాలనీ సంక్షేమ సంఘాలకు హైడ్రా ఒక బలమైన రక్షణ వ్యవస్థగా కనిపిస్తోంది. అందుకే పూర్తి మద్దతు దొరుకుతోంది. మరోవైపు కూల్చివేతలకు గురైన బాధితులు, ప్రతిపక్షాలు దీనిని ప్రభుత్వం చేపడుతున్న రాజకీయ అణచివేత చర్యగా, చట్టబద్ధతలేని ఒక వ్యవస్థగా అభివర్ణిస్తున్నాయి.

**అందుకే విశ్వాసం..**

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ వ్యవస్థ పై హైదరాబాద్ ప్రజలకు నమ్మకం ఏర్పడింది. ప్రజావాణి వేదికగా వస్తున్న విన్నపాలు, ఫిర్యాదులు దీనిని తెలియ జేస్తున్నాయి. ప్రభుత్వ వ్యవస్థల్లో లంచగొండితనం, ఆక్రమణలపై చర్యలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించే ధోరణితో విసిగిపోయిన ప్రజలకు.. కచ్చితంగా వ్యవహరించే హైడ్రా పై విశ్వాసం పెరిగింది. విమర్శలను స్వీకరిస్తూనే చట్టబద్ధమైన ప్రక్రియలు పాటిస్తూ.. పేదలకు నష్టం కలగకుండా నిజమైన ఆక్రమణదారులపై కఠినంగా వ్యవహరిస్తే మాత్రం హైడ్రా మరింత ప్రజాదరణ దక్కించుకోవడం ఖాయం.

# భూమా ఫ్యామిలీలో వార్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, రాయలసీమ బ్యూరో:** సీనియర్ నేత భూమా నాగిరెడ్డి కుటుంబంలో చీలిక వచ్చిందా? పదవుల కోసం పిల్లలు విడిపోతున్నారా? రాజకీయ ఆధిపత్యం లో భాగంగా వారి మధ్య విభేదాలు నడుస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇటీవల అహోబిలం వివాదంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను చంద్రబాబు పిలిచి మందలించినట్లు వార్తలు వచ్చాయి. నియోజకవర్గంలో కుటుంబ సభ్యుల జోక్యం అధికం అవుతోందని.. దానిని తగ్గించుకోవాలని హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది. పరోక్షంగా ఆమె భర్త ప్రమేయం పెరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలోనే హై కమాండ్ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం.

**వివాదాల్లో అఖిలప్రియ..**

మొన్నటి ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు భూమా అఖిల ప్రియ. కానీ తరచు ఆమె వివాదాస్పద అంశాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీ హై కమాండ్ ఎప్పటికప్పుడు మందలిస్తూ వస్తోంది. కానీ ఆమె వైఖరిలో ఎటువంటి మార్పు రావడం లేదు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా ఆమె సోదరుడు జగత్ విఖ్యాత్ రెడ్డి రంగంలోకి దిగారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తన తండ్రి అనుచరులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. అందులో సక్సెస్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఆళ్లగడ్డ నుంచి బరిలో దిగేందుకు జగత్ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అఖిల ప్రియ తరచు వివాదాల్లో చిక్కుకోవడంతో ప్రత్యామ్నాయంగా టిడిపి నాయకత్వం విఖ్యాత్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నట్లు కూడా కర్నూలు పొలిటికల్ సర్కిల్స్ లో ఒక ప్రచారం సాగుతోంది.

**భూమా దంపతుల ముద్ర..**

కర్నూలు జిల్లాలో భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి తనదైన శైలిలో రాజకీయాలను నడిపారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం గడిపిన ఆ దంపతులు ప్రజారాజ్యం పార్టీ ఎంట్రీతో ఆ పార్టీలో చేరారు. అయితే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలో చేరారు. కానీ శోభా నాగిరెడ్డి అకాల మరణంతో ఆమె తరుపున రంగంలోకి దిగారు అఖిలప్రియ రెడ్డి. తండ్రి శోభ నాగిరెడ్డి తో కలిసి అసెంబ్లీకి పోటీ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఇద్దరూ గెలిచారు. కానీ తరువాత క్రమంలో టిడిపిలోకి ఫిరాయించారు. ఇంతలో భూమా నాగిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. చంద్రబాబు అఖిల ప్రియకు మంత్రి పదవి ఇచ్చి ప్రోత్సహించారు. 2019 ఎన్నికల్లో అఖిలప్రియ ఓడిపోయారు. 2024 లో మాత్రం గెలిచారు.

**నంద్యాలలో నో ఛాన్స్..**

నంద్యాల తో పాటు ఆళ్లగడ్డలో భూమా కుటుంబానికి ప్రత్యేక పట్టు ఉంది. అయితే ఆ రెండు నియోజక వర్గాలు తమ కుటుంబ సభ్యులకు కేటాయించాలని అఖిల ప్రియ కోరారు. కానీ నంద్యాల నుంచి ఎండి ఫరూక్ ను రంగంలోకి దించారు చంద్రబాబు. వచ్చే ఎన్నికల్లో ఆయన కుమారుడు పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో ఉన్న ఒక్కగానొక్క ఆళ్లగడ్డ నియోజకవర్గం కోసం భూమా నాగిరెడ్డి పిల్లలు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మంచు మనోజ్ కుమార్ భార్య భూమా అలేఖ్య రెడ్డి సైతం పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధపడుతున్నారు. ఆమె కూడా ఆళ్లగడ్డపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ముగ్గురు పిల్లల మధ్య కోల్డ్ వార్ ప్రారంభం అయింది. ఎవరికివారుగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

# అగ్రిగోల్డ్ బాధితులకు శుభవార్త!

తద్వారా వచ్చే నిధులను బాధితులకు పంపిణీ చేసేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మేరకు క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పరిహారానికి సంబంధించి విధివిధానాలను వెల్లడించారు. త్వరలో బాధితులందరికీ డిపాజిట్లు చెల్లించేందుకు రూట్ షెడ్యూల్ ను రూపొందిస్తున్నట్లు కూడా ప్రకటించారు. దీంతో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న అగ్రిగోల్డ్ బాధితులకు ఇది కొంత ఉపశమనం కలిగించే విషయమే.

**ఇది పరిస్థితి..:** రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ సంస్థకు 20,450 ఎకరాల స్థిరాస్తులు ఉన్నాయి. ఇదే విషయాన్ని ప్రభుత్వం కూడా గుర్తించింది. అయితే తొలి విడతలో భాగంగా 6330 ఎకరాలను బహిరంగ వేలం వేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ వేలం ద్వారా సమకూరిన ఆదాయాన్ని బాధితులకు చెల్లించాలని నిర్ణయించింది. వేలానికి సంబంధించిన విధి విధానాలను ఈ నెలలోనే ఖరారు చేయనున్నారు. వచ్చే నెల 15 నాటికి తొలి విడత డబ్బు చెల్లింపు ప్రక్రియను ప్రారంభించినట్లు కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 11న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో మంత్రివర్గ ఉప సంఘం సమావేశమై ఆస్తుల వేలానికి సంబంధించిన విధివిధానాలతో పాటు అంతర్రాష్ట్ర సమస్యలపై చర్చించుకున్నారు. బాధితులకు స్పష్టమైన వివరాలు తెలియజేసే విధంగా వెబ్సైట్ కూడా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**అలా డిపాజిట్లు పక్కదారి..:** దేశవ్యాప్తంగా 5.85 లక్షల మంది ఏజెంట్లు అగ్రిగోల్డ్ సంస్థకు ఉండేవారు. సుమారు 32 లక్షల మంది ఖాతాదారులు ఉండేవారు. వారి వద్ద నుంచి రూ.6380 కోట్ల రూపాయలను సేకరించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అందులో ఒక్క ఏపీలోనే రూ.3944 కోట్లు ఉన్నాయి. దాదాపు 18, 57,290 మందికి ప్లాట్లు ఇస్తామని ఆశ చూపి..5,76,579 ప్లాట్లను మాత్రమే చూపించి డిపాజిట్లను పక్కదారి పట్టించింది అనేది అగ్రిగోల్డ్ పై ఉన్న అభియోగం. అప్పటినుంచి బాధితులు ఆశగానే ఎదురుచూస్తున్నారు. 2019లో ఏపీలో జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయంగా లబ్ది పొందారు. కానీ ఎటువంటి న్యాయం చేయలేదు. ఇప్పుడు కూటమి వచ్చిన తరువాత క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయింది. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటుంది. తొలివిడతగా వచ్చేనెల 15లోగా చెల్లింపులు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# విజయసాయిరెడ్డి యూటర్న్!

జగన్మోహన్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.

**ఏడాదిన్నర కిందట రాజీనామా..**

ఏడాదిన్నర కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు విజయసాయిరెడ్డి. ఆ పార్టీకి రాజీనామా చేయడమే కాదు రాజ్యసభ పదవికి సైతం రిజైన్ చేశారు. అయితే తరువాత వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. ఇక రాజకీయాల్లోకి పోదలుచుకోలేదని కూడా చెప్పారు. అయితే వైసిపి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా.. ఆ పార్టీ రాజ్యసభ పదవిని వదులుకొని మరి బయటకు వెళ్లిపోయారు. కేవలం కూటమితో ఒప్పందం చేసుకుని వెళ్లారని.. ఇది ఒక వెన్నుపోటుగా వైసీపీ నేతలు అభివర్ణించారు. జగన్మోహన్ రెడ్డి సైతం తీవ్ర విమర్శలు చేశారు. అయితే వ్యవసాయం చేసుకుంటానన్న విజయసాయిరెడ్డి ఉన్నట్టుండి మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. ఈ ఏడాది జూలైలో ప్రకటన ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. అయితే ఆ సమయంలో సైలెంట్ గా ఉన్న ఆయన తాజాగా మరోసారి ప్రకటన చేశారు. దీంతో విజయసాయిరెడ్డి ఏదో ఒక పార్టీలో చేరడం ఖాయమని తెలుస్తోంది.

**సంక్షోభంలో పార్టీ..**

మొన్నటి ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తర్వాత సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటుంది ఆ పార్టీ. ముఖ్యంగా ఢిల్లీ స్థాయిలో వ్యవహారాలను చక్కబెట్టడం, విపక్షాలు దాడి చేస్తున్న వేళ పార్టీ తరఫున గట్టిగా నిలబడడం, సరైన పొలిటికల్ స్ట్రాటజీలను అమలు చేయడంలో లోటు కనిపిస్తోంది. సజ్జల రామకృష్ణారెడ్డి తో వై వి సుబ్బారెడ్డి చక్కబెడుతున్నారు. కానీ విజయసాయిరెడ్డి అంతగా ప్రభావితం చూపలేకపోతున్నారు. క్యాడర్లో కూడా అదే అసంతృప్తితో ఉంది. అందుకే విజయసాయిరెడ్డిని మళ్లీ తెచ్చుకుంటే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది.

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి..**

మరోవైపు విజయసాయిరెడ్డి పరిస్థితి కూడా ఏమంత బాగాలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమైన తర్వాత ఎదుర్కొన్న పరిణామాలు, పొలిటికల్ గ్యాప్ ఆయనకు రాజకీయ మైలేజ్ ఇవ్వడంలేదు. మళ్లీ రాజకీయంగా ప్రాధాన్యత దక్కాలంటే యాక్టివ్ పాలిటిక్స్ చేయాల్సిందేనన్న నిర్ణయానికి వచ్చారు విజయసాయిరెడ్డి. దశాబ్దాలుగా వైయస్ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని.. వైసిపి నిర్మాణంలో తన పాత్రను గుర్తించి.. మళ్లీ వైసీపీలో చేరిపోతేనే బాగుంటుందని విజయసాయి రెడ్డికి సన్నిహితులు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి సానుకూలత వ్యక్తం చేయడంతో ఆయన మనసులు విజయసాయిరెడ్డి తో చర్చలు జరుపుతున్నారని కూడా ఒక ప్రచారం ఉంది..

**తప్పకుండా అభ్యంతరాలు..**

అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వస్తూ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో అధినేత చుట్టూ ఉన్న కోటరీ వల్ల తాను బయటకు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ఇప్పుడు విజయసాయిరెడ్డి చేరిక విషయంలో అనేక రకాల అభ్యంతరాలు వ్యక్తం అయ్యే అవకాశం ఉంది. మరోవైపు పార్టీలో తన హోదా, పాత గౌరవం దక్కితే కానీ విజయసాయిరెడ్డి సైతం వైసీపీలో చేరే ఛాన్స్ లేదు. కానీ రాజకీయాల్లో అవసరాలు పనిచేస్తాయి. విజయసాయిరెడ్డి అవసరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్ కు ఉంది. అంతే అవసరం విజయసాయి రెడ్డికి కూడా ఉంది. అందుకే సంచలన రాజకీయ నిర్ణయం ఉండబోతోంది అన్న ప్రచారం జరుగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# రాజకీయాలకు చిరు శాశ్వత దూరం!



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ అధికారిక బ్రాండ్ అంబాసిడర్ గా మెగాస్టార్ చిరంజీవిని ప్రభుత్వం నియమించబోతోంది అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి మెగాస్టార్ చిరంజీవి బ్రాండ్ అంబాసిడర్ గా ప్రచారం చేస్తారని టాక్ నడిచింది. గతంలో గుజరాత్ అమితాబ్ బచ్చన్ వ్యవహరించిన తీరు మాదిరిగానే.. రాజశేఖర్ రెడ్డి హయాంలో నాగార్జున తరహా లోనే.. ఏపీ పర్యాటక పెట్టుబడుల ప్రచారం కోసం చిరంజీవిని రప్పించేందుకు చర్చలు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది అంటూ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై మెగాస్టార్ చిరంజీవి టీం స్పందించింది.

**ఆ ప్రచారాన్ని నమ్మవద్దు..**

ఏపీ బ్రాండ్ అంబాసిడర్ గా మెగాస్టార్ చిరంజీవి నియామకం కానున్నారు అంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం వదంతులేనని ఆ టీం తేల్చింది. అందులో ఎంత మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. అటువంటి ప్రచారాలను ఎవరు నమ్మవద్దని.. సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ ప్రచారం చేయవద్దని మెగా అభిమానులకు, సాధారణ ప్రజలకు స్పష్టమైన విజ్ఞప్తి చేసింది.

**అమితాబ్ బచ్చన్ మాదిరిగా..**

ఏపీలో కూటమి వచ్చిన తరువాత చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల విషయంలో సినీ ప్రముఖులతో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే గుజరాత్ లో అమితాబ్ బచ్చన్ పరహాల్లో చిరంజీవిని ఏపీ బ్రాండ్ అంబాసిడర్ గా పెట్టుకోవాలన్న ప్రతిపాదన వచ్చింది. అయితే దీనిపై పెద్ద ఎత్తున రచ్చ నడిచింది. ఇప్పటికే బీజేపీ సైతం రాజ్యసభ ఆఫర్ చేయగా మెగాస్టార్ సున్నితంగా తిరస్కరించారు. పూర్తిస్థాయి రాజకీయాలకు దూరంగా ఉంటానని ఇప్పటికే చిరంజీవి పలుమార్లు స్పష్టం చేశారు. ఇప్పుడు దీనిపై పూర్తి స్పష్టతనిచ్చినట్లు అయింది.

## రాజకీయ ముద్ర..

ఉమ్మడి ఏపీ రాజకీయాల్లోనే చిరంజీవి తనదైన ముద్ర చాటుకున్నారు. ప్రజారాజ్యం పార్టీని ఏర్పాటు చేసి 2009 ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే కేవలం 18 అసెంబ్లీ స్థానాలకు మాత్రమే పరిమితం అయ్యారు. కానీ 70 లక్షల వరకు ఓట్లు సొంతం చేసుకున్నారు. కానీ కొద్ది కాలానికే తన పార్టీని కాంగ్రెస్లో విలీనం చేశారు. రాజ్యసభ సభ్యత్వం పొంది కేంద్ర మంత్రి అయ్యారు. 2014లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ పతనం అయింది. ఆపై కేంద్రంలో కూడా అధికారాన్ని కోల్పోయింది. అప్పటినుంచి రాజకీయాలకు దూరమయ్యారు చిరంజీవి. అన్ని పార్టీలతో సఖ్యతగా మెలుగుతూ ముందుకు సాగారు. మొన్నటి ఎన్నికల్లో మాత్రం తన సోదరుడు పవన్ కళ్యాణ్ జనసేనకు మద్దతు ప్రకటించారు. తద్వారా తన మద్దతు కూటమికేనని అభిమానులకు సంకేతాలు పంపారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాలుగా ప్రచారం నడిచింది. ఇప్పుడు కూటమి కి బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల అది ఇంకా ఎక్కువైంది. ఈ తరుణంలో మెగాస్టార్ చిరంజీవి టీమ్ స్పందిస్తూ పూర్తి స్పష్టతనిచ్చింది.

# ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

## గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

ఖమ్మం,ఆగస్ట్: ల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి నెలకు నిర్ణీత ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పథకం ద్వారా వృద్ధులు, విధవలు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ. 2,016 చొప్పున పింఛను అందజేస్తున్నారు. అలాగే దివ్యాంగులకు, తీవ్రమైన శారీరక రుగ్మతలు ఉన్నవారికి నెలకు రూ. 4,016 లభిస్తోంది. అంతేకాకుండా ÷ల్గ÷లేరియా బాధితులకు కూడా ప్రతి నెలా రూ. 2,016 ఆర్థిక సాయం అందుతోంది. సమగ్ర భూ సర్వే చేపట్టి ’భూ భారతి’ ద్వారా లబ్దిదారులకు డిజిటల్ మ్యాప్తో సహా భూమి హక్కు పత్రాలు అందజేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అనర్హుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తామని, అర్హులైన పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. అలాగే రెండు మూడు రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నాడు. అంతే కాకుండా.. రాబోయే మొదటి పంటకే సాగునీరు అందిస్తామని తెలిపారు.

# గ్రేటర్ రోడ్లు చూతాం రారండి!

గంటల తరబడి వాహనాలు నత్తనడకన సాగడానికి ప్రధాన కారణం నగర రహదారులే. వర్షాకాలంలో తారు రోడ్లు వేయడం, శాశ్వత రిపేర్లు చేయడం సాంకేతికంగా కష్టం. కానీ వర్షాలు లేని పొడి రోజుల్లో కూడా కనీసం కోల్డ్ మిక్స్, ప్యాచ్ వర్క్ చేసి ఆ గుంతలను పూడ్చే పనిచేయడం లేదు నగరపాలక సంస్థ యంత్రాంగం. కోట్లాది రూపాయలు వసూలు చేస్తోంది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. కానీ ప్రజల ప్రధాన మౌలిక వసతి అయిన రహదారులను మాత్రం బాగు చేయడం లేదు.



**అరచేతిలో ప్రాణాలు..**

బైక్ పై కార్యాలయానికి వెళ్లాలనుకున్నవారు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణాలు సాగించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి హైదరాబాదులో నెలకొంది. పౌరులు తమ పరిస్థితిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా అధికారులకు ట్యాగ్ చేస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కానీ వాటిని పట్టించుకునే పరిస్థితుల్లో మున్సిపల్ యంత్రాంగం లేకపోవడం మాత్రం దారుణం.. ప్రజా రవాణా పట్ల, వారి భద్రత పట్ల యంత్రాంగానికి ఉన్న బాధ్యతరాహిత్యాన్ని ఇది తెలియజేస్తోంది.

గ్లోబల్ సిటీగా చెబుతున్న హైదరాబాద్లో రోడ్ల నిర్వహణ విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం విమర్శలకు గురిచేస్తోంది. రహదారుల నిర్వహణలో కాంట్రాక్టర్ల జవాబుదారీతనం లోపించడం, పేలవమైన నిర్మాణ నాణ్యత, లైన్మెన్ల తవ్వకాలు, డ్రైనేజీ పనుల తర్వాత సరిగ్గా రీస్టోరేషన్ చేయకపోవడం ఈ పరిస్థితికి మూల కారణం. కేవలం కాగితాలపై, రిపోర్టులో ప్యాచ్ వర్క్ పూర్తి చేసాం అని రాసుకోవడమే తప్ప.. ఈ రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపడంలో యంత్రాంగం విఫలం అవుతుంది. వర్షాలు పడే సమయంలో గోతుల గురించి చర్చించుకోవడం.. తరువాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. కనీసం ఈ వర్షాకాలం తర్వాత అయినా యుద్ధ ప్రాతిపదికన.. నగరవ్యాప్తంగా ఉన్న గుంతలను పూడ్చకపోతే ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. తెల్చుకోవాల్సింది ప్రభుత్వమే.

## జొన్న రైతులకు శుభవార్త

హైదరాబాద్: తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర రైతాంగానికి తీపి కబురు అందించారు. జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ. 994 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, పంటల కొనుగోలు విధానం వేగవంతంగా, పారదర్శకంగా సాగుతోందని, ఇది మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.అలాగే రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం చేసేందుకు రూపొందించిన 'తెలంగాణ ఎరువుల యాప్' విజయవంతం కావడంతో, దాని ప్రమాణాల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఈఈ÷ూ) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నూతన ఎరువుల పంపిణీ విధానాన్ని నేటి నుంచి మరో 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, అవగాహన అందించాలని ఆదేశించారు. తెలంగాణను ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతికతను జోడించేలా నిర్వహించిన హ్యాండ్లూమ్ హ్యాకథాన్ లో విజేతగా నిలిచిన ప్రతిభావంతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల నైపుణ్యానికి సాంకేతికత తోడైతే మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగం బలోపేతమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం


### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్‌పల్లి దుర్గా కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై ఎన్నికల సన్నాహాలపై పార్టీ నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు దోబూచులాడుతున్నాయని ఎద్దేవా చేశారు. నీట్ లీకేజీల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో టిఆర్ఎస్ పార్టీ ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముదిరాజ్ సంఘం ఛైర్మన్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల పీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యేలు గాంధీ, వీర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నిజామాబాద్ మాజీ ఎంపీ మధు యాష్కీ కూడా సమావేశంలో పాల్గొన్నారు.రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, బూత్ స్థాయి ఏర్పాట్లు, పట్టభద్రుల నమోదు కార్యక్రమ పురోగతి తదితర అంశాలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## తెలంగాణ టూ ఏపీ!

కానీ ఇప్పుడు ఆ కేసు దర్యాప్తు సరిహద్దుల దాటి ఏపీ వైపు విస్తరిస్తోంది. కేవలం తెలంగాణ పరిధిలోని రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలే కాకుండా.. ఏపీలో కీలక నేతలు, ఉన్నతాధికారుల ఫోన్లు కూడా టాపింగు కు గురయ్యాయని ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే ఇది ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రధానంగా గతంలో ఏపీలో పర్యవేక్షణ, అధికార మార్పిడి సమయంలో పురుగు రాష్ట్ర నిఘా వ్యవస్థలను వాడుకొని.. కొందరికి లబ్ధి చేకూర్చేలా ఈ నిఘా పర్వం కొనసాగిందనే అనుమానాలు బలపడుతున్నాయి.



**ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలం..**

తాజాగా ఏపీకి చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ ఏబీవీ వెంకటేశ్వరరావును తెలంగాణ సిట్ విచారించింది. వాంగ్మూలాన్ని నమోదు చేసుకుంది. 2023 తో పాటు అంతకుముందు కూడా ఆయన కాల్ డేటా, సంభాషణలను అక్రమంగా సేకరించినట్టు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. భారత రాష్ట్ర సమితి హయాంలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ పొరుగు రాష్ట్రానికి చెందిన ఒక ఐపీఎస్ అధికారిపై నిఘా పట్టడం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయి? అప్పటి ఏపీ రాజకీయాల్లో వ్యూహాత్మక లబ్ధి కోసమే ఈ సమాచారాన్ని ఇతరులతో పంచుకున్నారా? అనే కోణాల్లో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది.

**లి జగన్ ప్రయోజనం..**

అయితే తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ టాపింగ్ చేయడం వెనుక జగన్ కు ప్రయోజనం ఉందన్న అనుమానాలు పెరుగుతున్నాయి. అప్పట్లో ఒక్క ఏబీవీతోనే ఆగలేదు. 2014లో ఏపీలో అధికారంలోకి వచ్చింది టిడిపి. తెలంగాణలో అధికారంలోకి వచ్చారు కెసిఆర్. టిడిపి ప్రభుత్వ కీలక నేతలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కోటరీకి అత్యంత సన్నిహితంగా ఉండే పోలీసు అధికారులు, వ్యాపారవేత్తల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నాడు జగన్మోహన్ రెడ్డి ప్రయోజనాల కోసం లేదా ఆయనకు సమాచారం చేరవేసే క్రమంలో తెలంగాణలోని గత ప్రభుత్వ పెద్దలు ఇలా చేయించారనే ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నేతల ఫోన్ నెంబర్లను మావోయిస్టుల పేరిట జాబితాలో చేర్చి.. డేటాను దొంగిలించిన తీరుపై దర్యాప్తు బృందాలు ఆధారాలు సేకరించాయి.

**లి తుది నివేదికలో..**

తెలంగాణ ప్రభుత్వం ఫోన్ టాపింగ్ పై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు సిట్ అధికారులు ఈ కేసులో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసేందుకు కసరత్తు మమరం చేస్తున్నారు. తుది నివేదికలో ఏపీకి చెందిన ప్రముఖుల ఫోన్ల టాపింగ్ ఆధారాలు, దానికి సహకరించిన అధికారులు, ప్రయోజనం పొందిన రాజకీయ పెద్దల పేర్లు అధికారికంగా చేర్చే అవకాశం ఉందని తెలుస్తోంది. చట్ట విరుద్ధంగా టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ పక్క రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించిన ఈ కుట్ర కోణాలు చార్జ్ సీట్ రూపంలో బయటకు వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టించడం ఖాయం.


## నిశిత క్యాంపస్ లో విద్యార్థులకు సైబర్ క్రైమ్,డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం

**విద్యార్థులు చదుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలి --- డిసిపి నారాయణరెడ్డి**



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల పరిధిలో ఉన్న (మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థల సొసైటీ) నిశిత క్యాంపస్ లో విద్యార్థులకు సైబర్ క్రైమ్,డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ కె.నారాయణ రెడ్డి, ఏసీపీ ఎస్. జానకి రెడ్డి, కందుకూరు ఎస్ హెచ్ ఓ ఎచ్.వెంకటేశ్వర్లు,ఎస్ఐ బి.పరమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్సు స్పందించవద్దని అధికారులు సూచించారు.అలాగే డ్రగ్స్కుదూరంగా ఉండి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.సైబర్ నేరాలపై అప్రమత్తంగా డ్రగ్స్ కు దూరంగా ఉండటమే లక్ష్యం అంటూ పోలీసులు విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నిశిత క్యాంపస్ ప్రిన్సిపల్ దీప, ఏటీపీ శివానంద్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## ప్లే స్కూల్‌లో విషాదం.. తెల్లాపూర్‌లో ఆరేళ్ల బాలుడి మృతి

**ప్లే స్కూల్ నుంచి బయటకు వచ్చి చెరువులో పడ్డ చిన్నారి.. విషాదాంతం**

**భద్రతా లోపమే ప్రాణం తీసిందా?.. అవుననే అంటున్న స్థానికులు**

**స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యానికి ఆరేళ్ల చిన్నారి దుర్మరణం**

**ఆడుకోవాల్సిన వయసులో.. చెరువులో పడి చిన్నారి మృతి**

**గేటు దాటి వెళ్లిన చిన్నారి.. కన్నీరు మిగిల్చిన ఘటన**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06: సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలోని తెల్లాపూర్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్లే స్కూల్‌లో చదువుతున్న ఆరేళ్ల బాలుడు షణ్ముత్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో అక్కడ ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం, పార్చునర్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న షణ్ముత్ తెల్లాపూర్‌లోని శిఖరం వండర్ నెస్ట్ ప్లే స్కూల్‌లో చదువుతున్నాడు. ఉదయం తండ్రి స్కూల్‌లో దింపిన కొద్దిసేపటికే బాలుడు స్కూల్ ప్రాంగణం నుంచి బయటకు వచ్చి సమీపంలోని చెరువులో పడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడు స్కూల్ నుంచి ఎలా బయటకు వచ్చాడు..? భద్రతా చర్యల్లో లోపాలున్నాయా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ విషాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.



పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబుడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఏ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే

# ప్రజా సమస్యలపై శ్రద్ధపెట్టని పార్లమెంటు!

మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా

మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి.

# బలమా? బుద్ధిపాటవమా? విజేతను నిర్ణయించే నాయకత్వ సూత్రం!

**అపారమైన మరియు విశాలమైన అరణ్య సామ్రాజ్యానికి అత్యున్నతమైన అగ్రనేతగా సింహమే విరాజిల్లుతోంది. దట్టమైన అడవిలో అది తన పంజా విసిరితే ఎంతటి బలిష్టమైన అడవి మృగమైనా క్షణాల వ్యవధిలోనే నేలకొరగాల్సిందే. దాని గర్జన ధ్వని వింటేనే కానల్లోని సకల జీవరాశులు తీవ్రంగా కంపించిపోతాయి. అయితే, ఇక్కడ ఒక ప్రాథమికమైన ప్రశ్న మరియు సంశయం ఉదయిస్తోంది సింహం ప్రతిరోజూ కేవలం తన శారీరక బలంతోనే పోరాటాల్లో విజయం సాధించగలదా? కాలం మరియు చరిత్ర చెప్పే సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తుంది. కేవలం కండరాల బలంతో ప్రతి సమరాన్నీ నిరంతరం గెలవడం సాధ్యం కాని పని. సదరు బాహుబలం వెనుక అత్యంత సూక్ష్మమైన ఆలోచన, సునిశితమైన వ్యూహరచన నిరంతరం సాగుతూనే ఉండాలి.**

సరిగ్గా ఇక్కడే కుశాగ్రబుద్ధి కలిగిన నక్క పాత్ర ప్రవేశిస్తుంది. పురాతన పంచతంత్ర కథల నుంచి ఈసప్ నీతి కథల వరకు లోతుగా పరిశీలిస్తే, నక్క శరీరక ఆకృతిలో అత్యంత బలహీనమైనదే అయినప్పటికీ, తన అపారమైన ప్రజ్ఞాపాటవాలతో మృగేంద్రాన్ని సహితం తన ఇచ్చానుసారం నడిపించగలిగింది. కాగా, ఇక్కడ అసలైన సంశయం ఏమిటంటే అంతిమంగా సమరంలో గెలిచింది సింహమా, లేక దానిని వ్యూహాత్మకంగా గెలిపించిన నక్కా?మానవ వికాస చరిత్రను మరియు రాజనీతి సూత్రాలను లోతుగా విశ్లేషిస్తే, నాయకత్వ పటిమ అనేది ఎల్లప్పుడూ ఈ రెండు విభిన్న ధర్మాల మధ్య జరిగే సమతుల్యతపైనే ముడిపడి ఉందనే విషయం స్పష్టమవుతుంది. ప్రసిద్ధ ఇటాలియన్ రాజనీతి తత్వవేత్త మాకియవెల్లి తన జగద్విఖ్యాత గ్రంథం ది ప్రిన్స్ లో ఒక అద్భుతమైన విశ్లేషణ చేశారు. ఒక సమర్థుడైన పాలకుడు క్రూరమైన తోడేళ్లను భయపెట్టడానికి సింహంలాంటి పరాక్రమాన్ని, ధైర్యాన్ని ప్రదర్శించాలి. అదే సమయంలో ప్రత్యర్థులు పన్నే కుట్రలు, ఉచ్చులను పసిగట్టడానికి నక్కలాంటి అత్యంత తెలివైన చాతుర్యాన్ని కలిగి ఉండాలి అని ఆయన స్పష్టంగా విచారించారు. ఈ ప్రాథమిక సూత్రంలోనే నాయకత్వ మర్మమంతా నిగూఢంగా దాగి ఉంది. కేవలం సమాజంలో భయాందోళనలు సృష్టించే శారీరక శక్తి ఒక్కటే ఉంటే సరిపోదు, ఎందుకంటే వ్యూహాత్మక శత్రువులు ఎప్పుడూ కుట్రపూరితమైన ఉచ్చులు పన్నుతుంటారు. అట్టి తీవ్ర ప్రమాదాలను ముందస్తుగా అంచనా వేసే విచక్షణాజ్ఞానం లేని నేత ఎంతటి పరాక్రమవంతుడైనా ఏదో ఒక రోజు ఘోర పతనాన్ని మూటగట్టుకోక తప్పదు.అలాగే, బాహుబలం లేకుండా కేవలం ఉపాయాలు, కుతంత్రాలు మాత్రమే ఉంటే అది కూడా సమాజానికి నిరుపయోగమే అవుతుంది. అటువంటి నాయకుడిని సమాజం గానీ, అనుచరులు గానీ ఎంతమాత్రం గౌరవించరు, భయపడరు. కేవలం వాగ్ధాటితో మాయమాటలు చెప్పినంత మాత్రాన కార్యసిద్ధి కాదు, తీవ్ర సంక్షోభ సమయంలో నిలబడి పోరాడే తెగువ, దార్శనికత లేకపోతే ఆ నాయకత్వం ఎక్కువ కాలం నిలబడలేదు. అందువల్ల, ఒక పరిపూర్ణ నాయకుడు సింహంలో ఉండే నిర్భయత్వాన్ని, నక్కలో ఉండే వ్యూహాత్మక చతురతను సమపాళ్లలో మేళవించుకోవాల్సి ఉంటుంది.ప్రపంచ చరిత్ర పుటలను తిరగేస్తే, అనేక దండయాత్రల విజయాలు, బృహత్తర సామ్రాజ్యాల ఆవిర్భావాలు మహానాయకుల పేరిటే చరిత్రలో నమోదు చేయబడ్డాయి. అయితే, ఆ శూరుల విజయ పరంపర వెనుక ఎల్లప్పుడూ ఒక అదృశ్య వ్యూహకర్త నక్కలా కార్యాచరణ నడిపించాడనేది చారిత్రక సత్యం. కుశాగ్రబుద్ధి కలిగిన చాణక్యుడి దిశానిర్దేశం, రాజనీతి లభ్యత లేకపోతే అనాథయైన చంద్రగుప్త మౌర్యుడు అంతటి అఖండ మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించగలిగేవాడా? పరమాత్ముడైన శ్రీకృష్ణుడి సమయస్ఫూర్తి, చతురంగ వ్యూహాలు లేకుండా పాండవులు కురుక్షేత్ర మహాసంగ్రామంలో విజయదుందుభి మోగించగలరా? ఇక్కడ సింహం అంటే సమరరంగంలో ప్రత్యక్షంగా పోరాడే వీర యోధుడు కాగా, నక్క అంటే వెనుక ఉండి సరియైన దిశను చూపే మేధావి. ఈ ఇద్దరి పరస్పర సయోధ్య మరియు సహకారం లేకుండా ఏ విజయం కూడా సంపూర్ణం కాజాలదు.

ఈ వ్యూహాత్మక సిద్ధాంతం కేవలం ప్రాచీన కాలానికే పరిమితం కాలేదు. నేటి ఆధునిక కార్పొరేట్ మరియు రాజకీయ రంగానికి సైతం అక్షరాలా వర్తిస్తుంది. ఒక బహుళజాతి వ్యాపార సంస్థకు సీఈఓ బాహ్య ప్రపంచానికి కనిపించే ధైర్యవంతుడైన సింహం అయితే, ఆ సంస్థ ఆర్థిక నిర్ణయాల వెనుక అహోరాత్రులు శ్రమించే వ్యూహాత్మక బృందం, సలహాదారులు నక్కలుగా వ్యవహరిస్తారు. సమకాలీన రాజకీయాలలో బహురంగ వేదికలపై గర్జించే రాజకీయ నాయకుడు సింహమైతే, ఎన్నికల వ్యూహాలను పక్కాగా రచించే ఎన్నికల వ్యూహకర్తలు తెరవెనుక ఉండే నక్కలు. క్రీడారంగంలో మైదానంలో శ్రమించే క్రీడాకారుడు సింహమైతే, అతడిని వ్యూహాత్మకంగా తీర్చిదిద్దే కోచ్ నక్క. ఈ రెండు శక్తుల సమన్వయం కుదిరినప్పుడే అపూర్వ విజయాలు సాధ్యమవుతాయి. ఈ తీవ్రమైన పోటీ సందర్భంలో ఒక ముఖ్యమైన హెచ్చరికను గమనించాల్సి ఉంది. నక్క తన తెలివితేటలను కేవలం స్వార్థపూరిత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే, అది సింహాన్ని మోసగించి సింహాసనాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తే నాయకత్వ వ్యవస్థే పూర్తిగా కుప్పకూలుతుంది. చరిత్రలో అనేకమంది సలహాదారులు తమ యజమానులను వెన్నుపోటు పొడిచి అధికారాన్ని గుప్పిట పట్టిన సంఘటనలు కొల్లలుగా ఉన్నాయి. అదేవిధంగా, సింహం తన శారీరక బలాన్ని మాత్రమే నమ్ముకుని వ్యూహకర్తల అమూల్యాభిప్రాయాలను తృణప్రాయంగా తిరస్కరిస్తే, అది అహంకారానికి బలై చివరకు ఘోర పతనాన్ని చవిచూస్తుంది. కాబట్టి, విజయం అనేది బలం, బుద్ధి రెండూ పరస్పర విశ్వాసంతో, గౌరవంతో ముందుకు సాగినప్పుడే లభిస్తుంది.ప్రస్తుత అత్యంత తీవ్రమైన పోటీ ప్రపంచంలో కేవలం అధికార దాహం ఉంటే సరిపోదు, అలాగని కేవలం తెలివితేటలు ఉన్నంత మాత్రాన కార్యం సిద్ధించదు. ఒక వ్యవస్థను విజయవంతంగా నడిపించాలన్నా, ఒక సమూహాన్ని గెలిపించాలన్నా ధైర్యంగా అడుగులు వేసే సింహపు పరాక్రమం, ప్రతి అవకాశాన్ని లోతుగా పరిశీలించి అడుగులు వేసే నక్క చతురత రెండూ అత్యంతావశ్యకం. విజయం అనేది ఏ ఒక్కరి సొత్తు కాదు, అది సింహం చూపే వీరత్వానికి, నక్క రచించే వ్యూహానికి లభించే సంయుక్త ప్రతిఫలం.ముగింపుగా చెప్పాలంటే, సింహం గెలిచిందా లేక నక్క దాన్ని గెలిపించిందా అనే నిత్యనూతన ప్రశ్నకు సమాధానం రెండూ సత్యమే. సింహం లేనిదే వ్యూహాలు ఆచరణరూపం దాల్చలేవు, నక్క లేనిదే బాహుబలం సరైన లక్ష్యాన్ని చేరుకోలేదు. సమర్థుడైన నాయకుడంటే తనలోని సింహాన్ని, నక్కను సమతుల్యంగా సమ్మేళనం చేసుకునేవాడే! అలాంటి నాయకత్వమే సమాజంలో శాశ్వత విజయాలను అందిస్తుంది.కాబట్టి వర్తమాన వార్తాపత్రికల విశ్లేషణల ప్రకారం, నాయకుడు అనేవాడు క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పోరాడే యోధుడిలా ఉండాలి, అదే సమయంలో వెనుక ఉండి సమర్థవంతంగా వ్యూహాలు రచించే శిల్పిలా వ్యవహరించాలి. బలం మరియు బుద్ధిల కలయికే ఏ సమాజానికైనా, రాజకీయ పక్షానికైనా విజయపథంలో ముందుకు నడిపించే ఇంధనం అవుతుంది. అనుభవం, చతురత, ధైర్యం కలబోసిన నాయకత్వమే ఎల్లప్పుడూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. భవిష్యత్తు విజయం వీరిద్దరి కలయిక పైనే ఆధారపడి ఉంటుంది.అంతేకాకుండా, వర్తమాన వ్యవస్థల్లో ఎదురయ్యే క్లిష్టమైన సవాళ్లను అధిగమించడానికి కేవలం ఒక్క గుణమే ఉంటే సరిపోదని స్పష్టమవుతోంది. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొని నిలబడాలంటే ధైర్యంతో కూడిన వ్యూహం, బుద్ధితో కూడిన పరాక్రమం రెండూ జంటగా ప్రయాణించాల్సిందే. అప్పుడే నిజమైన పాలకుడికి స్థిరమైన గుర్తింపు, విజయం సిద్ధించి సమాజంలో ఆ నాయకుడి పేరు నిరంతరం చిరస్థాయిగా నిలిచిపోతుంది.





డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# విదేశీ విరాళాలపై ఆంక్షల కత్తి

## కొత్త బిల్లుతో దేశంలో సేవాకార్యక్రమాలకు గండి

## కేంద్రం తీరుపై మండిపడ్డ ఎంపి శశిథరూర్

న్యూఢిల్లీ: దేశంలో విదేశీ నిధుల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధుల నియంత్రాణ చట్టం సవరణ–2026 బిల్లును తీసుకువచ్చింది. దీనిద్వారా ప్రస్తుతం అమలులో ఉన్న విదేశీ విరాళాల నియంత్రణ చట్టం మరింత కఠినతరం కానుంది. ఈ బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని కేంద్రం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు–2026పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న ఈ కొత్త బిల్లు దేశంలోని పౌర సమాజంపై ప్రభుత్వ నియంత్రణను మరింత పెంచేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు.. స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంఘాలను సమాజంలో అభివృద్ధి భాగస్వాములుగా కాకుండా, విదేశీ ప్రమేయాలుగా చూపేలా ఉన్నాయని శశిథరూర్ ఆరోపించారు. 'ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా, గడువు ముగిసినా లేదా సరెండర్ చేసినా.. ఆ సంస్థలకు చెందిన విదేశీ విరాళాలు, ఆస్తుల నిర్వహణను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకునేందుకు ఈ కొత్త బిల్లు వీలు కల్పిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక 'అధికార యంత్రాంగం' ఏర్పాటుకు కేంద్రం పావులు కదుపుతోంది. ఈ నిబంధన ద్వారా పాలనా పరమైన నిర్ణయాలతోనే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులు, విద్యాసంస్థలు, భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉంది' అని థరూర్ ఆరోపించారు. కేరళలో పలు ఛారిటబుల్ ట్రస్ట్‌లు, పాఠశాలలు, ఆస్పత్రులు గత శతాబ్ద కాలంగా కులమతాలకు అతీతంగా పేదలకు వైద్య, విద్యా సేవలు అందిస్తున్నాయని థరూర్ గుర్తుచేశారు. ఈ సంస్థలు స్థానిక విరాళాలతో పాటు విదేశీ నిధుల ద్వారా ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చుకుంటూ పేదలకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల పేరుతో ఈ సంస్థలను వేధించడం, ఆస్తులను జప్తు చేయడం వల్ల చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కఠినమైన నిబంధనల వల్ల విదేశీ నిధులు 87 శాతం మేర తగ్గిపోయి వేలాది సేవా సంస్థలు మూతపడ్డాయని, ఇప్పుడు తెస్తున్న ఈ కొత్త బిల్లు వాటిని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని థరూర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల కోట్లాది మంది పేదలకు అందుతున్న వైద్య, విద్య సేవలు నిలిచిపోతాయని హెచ్చరించారు.

# పెదనెమిల గ్రామాభివృద్ధికి ఈగ ప్రసన్న కుమార్ చేయూత

## రూ.2.50 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు -- పాఠశాలకు డెస్క్‌లు, దేవాలయానికి మైక్ సెట్ విరాళం





**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** జన్మించిన గ్రామానికి సేవ చేయడమే నిజమైన కృతజ్ఞత అనే భావనతో పెదనెమిల గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు ఈగ ప్రసన్న కుమార్ గ్రామాభివృద్ధి కోసం వరుసగా సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటున్నారు.గ్రామంలో శాంతిభద్రతలు మరింత పటిష్టంగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తికి స్పందించిన ఆయన, సుమారు రూ.2.50 లక్షల వ్యయంతో గ్రామంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల ద్వారా గ్రామంలో నిఘా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రజల్లో భద్రతపై విశ్వాసం పెరిగిందని గ్రామస్థులు తెలిపారు.ఇంతకు ముందు కూడా విద్యారంగానికి చేయూతగా పెదనెమిల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.1.25 లక్షల విలువైన డెస్క్--బెంచీలను అందజేశారు. దీంతో విద్యార్థులు మెరుగైన వసతులతో చదువుకునే అవకాశం లభించిందని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.అదేవిధంగా గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.50 వేల విలువైన మైక్ సెట్‌ను విరాళంగా అందించి, భక్తులు ఉదయం వేళల్లో భక్తి గీతాలను ఆస్వాదించేలా సహకరించారు.విద్య, ఆధ్యాత్మికత, గ్రామ భద్రత వంటి రంగాల్లో ఈగ ప్రసన్న కుమార్ అందిస్తున్న సేవలు గ్రామ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. సమాజ సేవ అనేది మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనే సందేశాన్ని ఆయన తన సేవా కార్యక్రమాల ద్వారా ఆచరణలో నిరూపించారని ప్రశంసించారు.

# తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర వెలకట్టలేనిది



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) ప్రజాయుద్ధనౌక గద్దర్ వర్ధంతి కార్యక్రమం బడంగ్ పేట్ లో నిర్వహించడం జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పలువురు. తాడిత పీడిత ప్రజల కోసం అలుపెరుగని ప్రజా పోరాట నాయకుడని, కోట్ల గొంతులను ఒక్కటి చేసి తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ రథాన్ని నడిపించిన మహనీయుడని, తెలంగాణ ఉద్యమంలో గద్దర్ అన్న పాత్ర వెలకట్టలేనిదని, శాంతియాత్ర పేరుతో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పల్లెలన్నింటిని కదిలించి ఉద్యమానికి ఊపిరి పోసిన నేత అని, అన్ని వర్గాల ప్రజల కోసం తన ఆటపాటలతో ఉద్యమాన్ని ఊరుతలూగించిన ఉద్యమ వీరుడని, ఆయన కలలుగన్న ఆశయం కోసం ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవలసిన అవసరం ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు గట్టు బాలకృష్ణ, బిరుదు చందర్, గట్టు మైపాల్, సూర్ణ గంటి విజయ్, సుంకి శాల వెంకటేష్, రాకేష్, డేవిడ్, పాండు, కృష్ణ తదితరులు ఉన్నారు.

# మాదిగ బోనాల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించిన జగ్గారెడ్డి



## శనివారం సంగారెడ్డిలో తొలి మాదిగ బోనాల ఉత్సవాలు

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** సంగారెడ్డి పట్టణంలో తొలిసారిగా మాదిగ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మాదిగ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఉత్సవాలకు శ్రీ అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామీజీని ఆహ్వానించినట్లు, ఆయన కార్యక్రమానికి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఐబీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే బోనాల ఊరేగింపు హస్తబల్ ఎల్లమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్వకేట్లు, పోలీసులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595




# విద్యార్థులకు రోటరీ చేయూత

### శ్రీ లిసరస్వతి శిశు మందిర్‌కు రూ.1.50 లక్షల క్రీడా సామగ్రి, 50 బెంచీల అందజేతలి

### దాతల సహకారం అభినందనీయం: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 5: విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల సౌకర్యాల మెరుగుదలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌కు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల విలువైన క్రీడా సామగ్రితో పాటు 50 బెంచీలను బుధవారం అందజేశారు.రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఈ సామగ్రిని పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షుడు గౌరు దయాకర్‌కు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.శ్రీ సరస్వతి శిశు మందిర్‌లు నైతిక విలువలతో కూడిన విద్యతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి విద్యాసంస్థల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చిలుకూరు బాలు, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, ఇమ్రాన్, కౌన్సిలర్ ఇంద్రకుమార్, రోటరీ క్లబ్ సభ్యులు విశ్వనాథ్, సిమ్రాన్ మైనీ, అశోక్ కుమార్, మాశెట్టి వీరయ్య, రేపాల అంతయ్య, సుదర్శన్, ఇన్నర్ వీల్ సభ్యులు మాశెట్టి భాగ్యలక్ష్మి, రేపాల వాసవి, గౌరు సీత, పాఠశాల ప్రతినిధులు మురహరి, అనంతరెడ్డి, యామిని వెంకటేశ్వర్లు, గూడూరు శ్రీనివాసరావు, బండారు ప్రసాద్, తిప్పన వెంకటేశ్వర్ రెడ్డి, రంగారావు, జగన్ శర్మ, ప్రధానోపాధ్యాయుడు చెన్నూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగష్టు06(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం సీనియర్ నాయకులు చిలుగూరి సత్తిరెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, బొడిగెసుదర్శన్,కన్నె కంటి శ్రీనివాసచారి, ఐటి పాముల పుష్ప, కొండూరు సత్తయ్య, దండ మల్లికార్జున్, పల్లెర్ల రామచందర్, ఉక్కుర్తి యాదగిరి, పారుపల్లి నరసింహ, వనం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించిన పర్వేద గ్రామ కార్యదర్శి వసంత



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించి భూగర్భ జలమట్టాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పర్వేద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొత్తగూడ గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వసంత పాల్గొని గ్రామ ప్రజలకు ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి వసంత మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు భవిష్యత్‌లో తాగునీటి సమస్యను అధిగమించవచ్చని తెలిపారు.పర్వేద వార్డు సభ్యులు, ఫీల్డ్ ఆఫీసర్ నర్సింలుతో కలిసి ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పర్వేద గ్రామ వార్డు సభ్యులు, ఫీల్డ్ ఆఫీసర్ నర్సింలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామాన్ని నీటి సంరక్షణలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వార్డు సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# జయశంకర్ ఆశయాల సాధనే నిజమైన నివాళి: రమేష్ యాదవ్


**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన పునాది వేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నవాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, మునిపల్లి మండల అధ్యక్షుడు నరేష్, పార్టీ నాయకులు సాయిరాం, రామకృష్ణతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.



# చిట్కుల్, జిన్నారం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి

## అమ్మవారికి ప్రత్యేక పూజలు.. భక్తులకు బోనాల శుభాకాంక్షలు





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన ఆషాఢ బోనాల మహోత్సవంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండారపు సంపత్ కుమార్‌ను నాయకులు అభినందించారు. అనంతరం జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు, తొట్టెల కార్యక్రమంలో కూడా ఆదర్శ్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామదేవతల బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయాలను దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్, ఆంజనేయులు, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, మేరాజ్ ఖాన్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రముఖ సినీ నటుడు, సేవామూర్తి సోను సూద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సోను సూద్ ఫౌండేషన్ మహబూబ్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సోను సూద్ శివ



**మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 06(క్రైమ్ మిర్రర్):** సోను సూద్ ఫౌండేషన్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అనకాపల్లి మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ నటుడు, సేవామూర్తి సోను సూద్ ని సోను సూద్ ఫౌండేషన్ -- మహబూబ్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సోను సూద్ శివ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోను సూద్ తో ఫౌండేషన్ నిర్వహిస్తున్న రక్తదాన సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని వివరించారు. సోను సూద్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆయనను ప్రత్యక్షంగా కలవడం తమకు ఎంతో ఆనందంగా, చిరస్మరణీయమైన సందర్భంగా నిలిచిందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించుకుందాం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)ద:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి పరిధిలోని 62వ డివిజన మల్లాపూర్, బాలాపూర్ ఆషాఢ మాస బోనాల సందర్భంగా మల్లాపూర్ బాలాపూర్ లోని నల్ల పోచమ్మ మరియు మహంకాళి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో సుఖశాంతులతో బోనాల పండుగను జరుపుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, పిసిసి కార్యదర్శి యేల్మెటి అమరేందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దేప భాస్కర్ రెడ్డి, నాదర్గుల్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, అశోక్, కార్పొరేటర్లు బాలు నాయక్, జైహింద్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీధర్, మధుసూదన్ రెడ్డి, భాను ప్రసాద్, రాఘవేందర్, లింగం, మహేందర్, వెంకటాచారి, శ్రీశైలం, కొమరయ్య, సురేష్ రాజ్, జల్పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అహ్మద్ బామ్, పవన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, చలపతి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజేష్ ఠాకూర్, రామచందర్, మాధురి శ్రీనివాస్, ఆనంద్, గిరి తదితరులు నాయకులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా రామడుగు మండల సర్వసభ్య సమావేశం...

సమస్యల పరిష్కారమే అజెండాగా సాగిన మండల సర్వసభ్య సమావేశం...

ఎమ్మెల్యేను ఘనంగాసన్మానించిన సర్పంచులు

మండల సమస్యల పై సుధీర్ఘంగా కొనసాగిన సమావేశం..


.ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం






**రామడుగు, ఆగస్టు 06(క్రైమ్ మిర్రర్):** రామడుగు మండలంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారమే అజెండాగా మండల సర్వసభ్య సమావేశం కొనసాగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎం అనిల్ ప్రకాష్ కిరణ్ ప్రత్యేక అధికారి అధ్యక్షతన గురువారం నిర్వహించిన రామడుగు మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్పంచులు పార్టీలకు అతీతంగా ఆప్యాయతలు పంచుతూ ఎమ్మెల్యేనిఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలని మిగిలిన సమయంలో మనమందరం ప్రజాసేవకులమన్నది మరవకూడదన్నారు. పార్టీలకు వర్గాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నొక్కి చెప్పారు. రెవెన్యూ,మండల పరిషత్,విద్యుత్,వ? యవసాయం,విద్య,వైద్యం ఇతర శాఖల పనితీరుపై, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేఆరా తీసారు. చేపట్టవలసిన పనులను అధికారులు నివేదిక రూపంలో తయారు చేయాలని తద్వారా ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేయించుకుని ముందుకు సాగవచ్చును అన్నారు. అన్ని గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరచాలని,కనీస మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దిశానిర్దేశం చేసారు. స్నేహపూర్వక వాతావరణం లో సర్వసభ్య సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆర్డిఓ షర్మిల, డిప్యూటీఈఈ ఏ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎమ్మార్వో రాజమల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మర వేణి తిరుమల ఎస్సై రాజు సర్పంచులు రాజేష్ కన్నా, నరసింగరావు, అంజన్ కుమార్, మొయిజ్, వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

## పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



**బాలాపూర్(క్రైమ్ మిర్రర్) :** మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధి బాలాపూర్ డివిజన్‌లో ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రజలందరికీ శుభం కలగాలని వేడుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రాంతం సుభిక్షంగా విలసిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు ఎర్ర జైహింద్, బాలింగని జంగయ్య, డివిజన్ అధ్యక్షులు నిరుడు శ్రీరాములు, టేకుల శశిధర్ రెడ్డి, తుళ్ళ నరహరి గౌడ్, గిరికటి కృష్ణంరాజు గౌడ్, పగడాల ఉమేష్, మహిపాల్ రెడ్డి, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు : చింతల రాఘవేందర్ ముదిరాజ్

**బాలాపూర్ క్రైమ్ మిర్రర్)బీ** బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఫీజు బకాయి - బిజెపి లడాయి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం, ఆర్ ఎన్ రెడ్డి నగర్ లోని టీకేఆర్ ఇంజనీరింగ్ మరియు పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పిలుపుమేరకు జరిగిన ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల రాఘవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ ప్రమోద్, పవన్, విజయ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం: ఆదర్శ్ రెడ్డి

### 92వ జయంతి సందర్భంగా ఘన నివాళులు





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రతీక ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ ఎల్‌ఐజీ బస్‌స్టాప్ ప్రాంగణంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి హాజరై ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య జయశంకర్ ఆలోచనలు, త్యాగం, సిద్ధాంతాలు చిరస్మరణీయమని, తెలంగాణ సమాజానికి ఆయన అందించిన మార్గదర్శకత్వం తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతి నగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పరమేష్ యాదవ్, ఎల్‌ఐజీ సొసైటీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, రాజా లింగం, సామ్యూల్ జాన్, బీఆర్ఎస్ నాయకులు అజీముద్దీన్, ఐలేష్ యాదవ్, అబ్బు, జకీర్, అరుణ జ్యోతి, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సరిత, రాణి యాదవ్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

### బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో

# విద్యార్థినులకు అవగాహన

**విద్యార్థినులకు 3,000 శానిటరీ ప్యాడ్ల పంపిణీ**

**రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన, అపోహలు వీడి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి**

**పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ, బాలికల ఆరోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం**

**జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి**

**సంగారెడ్డి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి మాట్లాడుతూ... రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక ఇన్ఫెక్షన్లను నివారించవచ్చని తెలిపారు. రుతుక్రమం ప్రతి బాలిక జీవితంలో సహజమైన ప్రక్రియ అని, దీనిపై అపోహలు, భయాలు, సిగ్గు భావం అవసరం లేదని పేర్కొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి లలితా దేవి మాట్లాడుతూ, యుక్తవయస్సు బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్, ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్లు సమృద్ధిగా ఉండే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.

కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, ఎస్ఓ కవిత, ఎంపీడీఓ, ఎంఈఓ, సర్పంచ్, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, షీ టీమ్ సభ్యులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.









## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు, ఆలోచనలు చిరస్మరణీయం : డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్‌పేట్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు, త్యాగాలు, ఆలోచనలు మరియు దూరదృష్టి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల అధికారులు, ఉద్యోగులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి ఘన నివాళులర్పించారు.




## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ జయశంకర్: కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాంతం కృషి చేసి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, ఆయన రచనలు, పరిశోధనలు ఉద్యమానికి మేధోబలాన్ని అందించాయని అన్నారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ఆయన విలువలు, ప్రజల పట్ల నిబద్ధత ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పలువురి అదృశ్యం, ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 ఏళ్ల విద్యార్థితో సహా పలువురు అదృశ్యమైనట్లు మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శోభన్ తెలిపారు. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం బడంగ్పేట్ కు చెందిన శివాజీ వయస్సు 15, నాదర్గుల్ లోని జడ్.పి.హెచ్.ఎస్ లో తొమ్మిదో తరగతి చదివే ఇతను గత నెల 1 నుండి, బడంగ్ పేట్ శివ నారాయణపురం చెందిన దేసోజు లక్ష్మీ వరప్రసాద్ వయస్సు 37, ఈనెల 2 నుండి బడంగ్పేట్ శివ నారాయణపురం కు చెందిన చవాన్ సక్కుబాయి వయస్సు 70, ఈనెల 4 నుండి, బడంగ్పేట్ సాయి బాలాజీ హోమ్స్ కు చెందిన సత్యం వయస్సు 48, జూన్ 11 నుండి కనిపించడం లేదని ఆచూకీ తెలిసినవారు మీర్పేట్ పోలీస్ స్టేషన్ కు 8712662299, 8712662646సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## సేవకుడే నాయకుడు అనే సిద్ధాంతాన్ని అందరూ ఆచరించాలి : కె ఎల్ ఆర్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్పేట్ సర్కిల్లోని నాదర్గుల్, బడంగ్పేట్ డివిజన్లో సమస్యలు లేని కాలనీలుగా తీర్చేందుకు కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు మర్రి శశాంక్ రెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్ లైట్స్, కాలనీల్లో గుంతల పూడ్చివేత కార్యక్రమాలను లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ వీధి దీపాలు ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు స్వచ్ఛందంగా చేయటం అభినందనీయమన్నారు. సేవకుడే నాయకుడు అనే సిద్ధాంతాన్ని అందరూ ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా సప్తగిరి, వైకుంఠపురం కాలనీవాసులు పలు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి : సర్పంచ్ రమాదేవి

**100 న్యూస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన**



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ సహకారంతో 100 న్యూస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు..ముఖ్య అతిథిగా సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు... కార్యక్రమ నిర్వాహకులు 100 న్యూస్ రాజ్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుష్ప్రవర్తనలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు..పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నార్సింగి సర్కిల్ కార్యాలయంలో ఘన నివాళులు..

**తెలంగాణ సిద్ధాంతకర్త సేవల స్మరణ**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజాభివృద్ధి, ప్రజాసేవలో ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. అనంతరం సర్కిల్ అధికారులు, సిబ్బంది కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన మేధోపరమైన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమం అనంతరం ఆయన ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు.

## యుపిఎస్సి--2027 ఉచిత కోచింగ్‌కు నేడే చివరి గడువు



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని బిసి స్టడీ సర్కిల్ ద్వారా నిర్వహించే యుపిఎస్సి సివిల్ సర్వీసెస్--2027 ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 7తో ముగియనుంది. డిగ్రీ ఉత్తీర్ణులైన సంగారెడ్డి జిల్లా అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. జగదీష్ తెలిపారు. మొత్తం 150 మందికి ప్రవేశం కల్పించనుండగా, ఎంపికైన వారికి నెలకు రూ.5,000 స్టైపెండ్, రూ.5,000 పుస్తక నిధి, గ్రంథాలయ సౌకర్యం, నిపుణుల బోధన అందించనున్నారు. స్క్రీనింగ్ పరీక్ష ఆగస్టు 16న, తరగతులు ఆగస్టు 24న ప్రారంభం కానున్నాయి.



గాంధీ భవన్లో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విచార్ విభాగ్ రాష్ట్ర స్థాయి పదాధికారుల సమావేశంలో ఏఐసీసీ-విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)



## గాంధారి ఖిల్లాలో తప్పిపోయిన వృద్ధురాలిని క్షేమంగా కాపాడిన పోలీసులు

**రామకృష్ణాపూర్, ఆగస్టు 6 (క్రైమ్ మిర్రర్) :** గాంధారి ఖిల్లా అటవీ ప్రాంతంలో గురువారం తప్పిపోయిన గంగవ్వ అనే వృద్ధురాలిని రామకృష్ణాపూర్ పోలీసులు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా గాలించి క్షేమంగా రక్షించారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యుల నుంచి విడిపోయి దారి తప్పిన ఆమె కోసం ఎస్సై జై శ్రీధర్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. రాత్రి అటవీ శాఖ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఆమె ఆచూకీ గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేగంగా స్పందించి వృద్ధురాలిని రక్షించిన పోలీసు, అటవీ శాఖ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

# నా ప్రేమకు అడ్డుపడుతున్నారు

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌పై కుమారుడు సంతోష్‌గౌడ్ సంచలన ఆరోపణలు**

**ప్రేమ వివాహం విషయంలో విభేదాలు..**

**ప్రాణహాని ఉందంటూ మీడియా ముందు ఆవేదన**






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్‌పై ఆయన కుమారుడు సంతోష్‌గౌడ్ చేసిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. తాను ప్రేమించిన యువతిని వివాహం చేసుకోవాలనే నిర్ణయానికి తన తండ్రి వ్యతిరేకిస్తున్నారని, ఈ నేపథ్యంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని సంతోష్‌గౌడ్ మీడియా సమావేశంలో ఆరోపించారు. సంతోష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మణికొండకు చెందిన రూపారెడ్డి కుమార్తెను తాను ప్రేమించానని, ఆమెను వివాహం చేసుకోవాలన్న తన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు తొలుత అంగీకరించలేదని అన్నారు. అనంతరం తన ఇష్టప్రకారమే వివాహం చేసుకోవచ్చని చెప్పడంతో గత నెలలో తమ నిశ్చితార్థం జరిగినట్లు వెల్లడించారు. అప్పటి నుంచి తాను తన కాబోయే అత్తమామల ఇంట్లోనే ఉంటున్నట్లు చెప్పారు.

**40 మందితో దాడి చేయించారు అంటూ ఆరోపణ..**

తనను ఏదో విధంగా అంతం చేయాలనే ఉద్దేశంతో సుమారు 40 మందితో తన కాబోయే అత్తమామల ఇంటిపై దాడి చేయించారని సంతోష్‌గౌడ్ ఆరోపించారు. ఈ ఘటన వెనుక తన తండ్రి ప్రమేయం ఉందని ఆయన పేర్కొన్నారు. దాడి అనంతరం పోలీసులకు సమాచారం అందించినప్పటికీ తమ ఫిర్యాదును సక్రమంగా స్వీకరించలేదని కూడా ఆరోపించారు. నార్సింగి పోలీసులు రాజకీయ ఒత్తిడికి లోనై తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని సంతోష్‌గౌడ్ ఆరోపించారు. మీడియా ముందుకు రావడం వల్ల తమ ప్రాణాలకు మరింత ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు తక్షణమే పోలీసు రక్షణ కల్పించి, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**ప్రజలంతా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష**

**బోనాల పండుగలో తెలంగాణ సంస్కృతి, ఆరోగ్య పరిరక్షణ సందేశం దాగి ఉంది ఎమ్మెల్యే**



**కూకట్‌పల్లి, ఆగస్ట్ 06 (క్రైమ్ మిర్రర్):** ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్‌లో గల పలు అమ్మవారి ఆలయాలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే అమ్మవారికి మొక్కులు చెల్లించి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంతో, పాడిపంటలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్యాభ్యాసంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, సామాజిక ఐక్యతకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పండుగ వెనుక ఎంతో గొప్ప చరిత్రతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన శాస్త్రీయ అంశాలు కూడా దాగి ఉన్నాయని వివరించారు. వర్షాకాలంలో వ్యాపించే బ్యాక్టీరియా, వైరస్‌ల నివారణలో సంప్రదాయ పూజా విధానాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉందని ఆయన చెప్పారు. అమ్మవారికి సమర్పించే పసుపు, కుంకుమ, ధూపం, దీపం, నైవేద్యాలు వంటి అంశాలు ఆరోగ్య పరిరక్షణలో సానుకూల ప్రభావం చూపుతాయని పెద్దలు విశ్వసించారని తెలిపారు. మన సంప్ర దాయాలు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించబడినవేనని ఆయన అన్నారు. అంతేకాకుండా ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ముఖ్యంగా పోషకాహారాన్ని తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం, కాలానుగుణంగా ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే సూచించారు. సరైన ఆహార నియమాలు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటూ జీవితంలో అనుకున్న లక్ష్యాలను విజయవంతం గా చేరుకోగలరని ఆయన పిలుపునిచ్చారు. బోనాల వంటి ఆధ్యాత్మిక వేడుకలు భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, ఆరోగ్య చైతన్యాన్ని కూడా పెంపొందిస్తాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా

# అవగాహన కార్యక్రమం






**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ.. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం ఏడో నెల నుంచి అదనపు ఆహారం ప్రారంభించి, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. తల్లిపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు తల్లికి కూడా ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యతపై రోల్‌ప్లే ప్రదర్శించగా, తల్లిపాలు--డబ్బాపాల మధ్య తేడాలను వివరించారు. తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం యూనిసెఫ్ ప్రతినిధులు ఎన్ఆర్సీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగలక్ష్మి, ఆర్ఎంఓ పద్మావతి, డీఐఓ డాక్టర్ శశాంక్, నర్సింగ్ సూపరింటెండెంట్ వసంత, వైద్యులు, సీడీపీవోలు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, అంగన్‌వాడీ టీచర్లు, నర్సింగ్ విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బంగారు భవిష్యత్తుకు పునాది

**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దాసరి బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తల్లిపాలు బంగారు భవిష్యత్తుకు పునాది అనే సందేశంతో రాజేంద్రనగర్ సర్కిల్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే మహామంత్రమని అధికారులు తల్లులకు అవగాహన కల్పించారు. శేరిలింగంపల్లి సెక్టర్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దాసరి బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కోమలి, పద్మజలు హాజరై తల్లులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లులకు అవగాహన కల్పించేందుకు టీచర్లు పళ్లు, కూరగాయలు, పప్పులు, ఔషదాలతో వాటి ప్రాముఖ్యతలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువుకు బలమైన ఆరోగ్యపునాది పడుతుందని తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే సరిపోతాయన్నారు. వేరే ఆహారం, నీరు కూడా అవసరం లేదన్నారు. తల్లిపాలలోనే శిశువుకు కావాల్సిన అన్ని పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. తల్లిపాలు తాగే పిల్లల్లో అంటువ్యాధులు, పోషకాహార లోపం, జీర్ణ సమస్యలు చాలా తక్కువగా ఉంటాయని, మానసిక, శారీరక ఎదుగుదల అద్భుతంగా ఉంటుందని వివరించారు. ప్రసవం తర్వాత తల్లి కూడా సమతుల్య పోషకాహారం తీసుకుంటూ వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా బిడ్డకు పాలు ఇవ్వాలని సూచించారు. అప్పుడే తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారు అన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు కనీసం రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ, శిశు సంరక్షణ, తల్లి ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. చివర్లో పాల్గొన్న గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ టి.సుమిత్ర, టి.అనిత, కె.వకుల, వై.సబిత, మాధవి, సీత, అనిత, సాయిప్రసన్న, సుజాతతో పాటు పెద్ద సంఖ్యలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు



**విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు.. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు**

**జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ**

**కూకట్ పల్లి, ఆగస్ట్ 06 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ జాతిపితగా, తెలంగాణ సిద్ధాంతకర్తగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం 248వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరనగర్‌లోని వడపల్లి ఎన్‌క్లేవ్ ఎదురుగా ఉన్న జయశంకర్ సార్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ సార్ విగ్రహ స్థాపకులు, చైర్మన్ కొమ్మగల్ల మోజెస్, విట్టల్, మహేష్, శ్రీధర్, శ్రీధర్ రెడ్డి, తలారి రాజు, మధు, పంతుల మల్లయ్య, రాజశేఖర్, బాబు, ఆంజనేయులు, శ్రీనివాస్, కొండాల్దవు, సిద్దేశ్వర్, ఎశ్వంత్, రాధిక, అనిత, గోపి ఎత్తరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా చిన్నా--పెద్దా అందరూ కలిసి జయశంకర్ సార్ చూపిన బాటలో నడుస్తూ, ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను భావితరాలకు చేర్చేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 248వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల భాస్కర్‌రావు, తెలంగాణ ఉద్యమకారుడు మాచర్ల భద్రయ్య, 248వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోదరీ సోదరులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధికి, తెలంగాణ ప్రగతికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, జయశంకర్ సార్ కలలు కన్న సమగ్ర తెలంగాణ నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు తెలంగాణ పోలీస్ అకాడమిలో ఘన నివాళి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమిలోని ఏకశిల అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు జి.కవిత, ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె.ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం, అంకితభావం, ఉద్యమ స్ఫూర్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో తెలంగాణ ఉద్యమకారులు క్రమబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అకాడమికి చెందిన ఎడిలు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, నరహరి, అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి యాదమ్మ, డిఎస్‌పిలు సతీష్, భాస్కర్, తోట శ్రీనివాసులు, జగదీష్, తిరుపతి, రిటైర్డ్ అడిషనల్ ఎస్‌పి సోమ శేఖర్‌లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి రేషన్ కార్డుదారునికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం అందిస్తున్నాం

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

దేశంలోనే రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ


కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామంలో మూడు నెలల ఉచిత సన్న బియ్యం పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రతి లబ్ధిదారునికి ప్రతి నెల 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామం చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి రేషన్ కార్డుదారులకు మూడు నెలల ఉచిత సన్నబియ్యాన్ని మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదలకు భద్రత, భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మన ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ప్రతినెల 6 కేజీల సన్నబియాన్ని అందిస్తుందని తెలిపారు. దేశంలో రేషన్ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని చాలా మంది వినియోగించకుండా అమ్మేయడం లేదా రీసైక్లింగ్ పేరుతో అక్రమాలకు గురికావడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అయ్యేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం నాణ్యంగా ఉండటంతో ప్రజలు స్వయంగా వినియోగిస్తున్నారని, ఒక్క గింజ తక్కువ వచ్చినా డీలర్లను ప్రశ్నించే స్థాయికి ప్రజల్లో చైతన్యం వచ్చిందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు మెరుగైన ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి చెప్పారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం నాణ్యత ఎంతో బాగుందని, గతంలో రేషన్ బియ్యాన్ని విక్రయించేవాళ్లమని, ఇప్పుడు మాత్రం కుటుంబ సభ్యులే వినియోగిస్తున్నామని, ఉచిత సన్నబియ్యం వల్ల తమ కుటుంబా లకు ఎంతో మేలు జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రేషన్ షాప్ డీలర్ వై. సైది రెడ్డి, గ్రామస్థులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాల సందడిలో కూకట్‌పల్లి ఆలయాలు కళకళ...

## అమ్మవార్ల ఆశీస్సులు పొందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



**కూకట్‌పల్లి, ఆగస్టు 06 (క్రైమ్ మిర్రర్):** ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బోనాల ఉత్సవాల సందడితో మారుమోగింది. అమ్మవారి ఆలయాలు భక్తజన సందోహంతో కళకళలాడగా, డప్పుల చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, రంగురంగుల బోనాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీల ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మూసాపేటలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయం, ఎల్లమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, బంగారు మైసమ్మ ఆలయం, పోచమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించగా, దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న బండి రమేష్‌కు ఆలయ ప్రాంగణాల్లో విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆషాఢ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మవారి కటాక్షంతో రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు,ఆయురారోగ్యాలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ మరింత ప్రగతి సాధించి దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల వేడుకల్లో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించడం, యువత సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించడం, పోతరాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొనగా, ఉత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మూసాపేట అధ్యక్షులు తూము సంతోష్, మల్లేష్ యాదవ్, సప్పిడి భాస్కర్, తోట రాజు, బాలరాజు, జోజమ్మ, దేవాలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..ఆషాఢ బోనాల ముగింపు వేడుకల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు భక్తుల సందోహంతో కిక్కిరిసిపోగా, సంప్రదాయం--ఆధ్యాత్మికత--సాంస్కృతిక వైభవం మేళవించిన ఈ వేడుకలు భక్తి పారవశ్యాన్ని నింపాయి.



# ఘనంగా హుడా కాలనీలో ఆషాఢ బోనాల వేడుకలు

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజేంద్రనగర్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని కొత్వాల్‌గూడ డివిజన్ హుడా కాలనీలో నిర్వహించిన ఆషాఢ బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, 119వ డివిజన్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని వారు ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు వారికి ఘన స్వాగతం పలికారు. బోనాల సందర్భంగా హుడా కాలనీ ఆలయ పరిసరాలు విద్యుత్ దీపాలతో, సంప్రదాయ అలంకరణలతో కళకళలాడగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 119వ డివిజన్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి చిల్కమర్రి పరందాములు, మల్లేష్ బైరమోని, ఉపాధ్యక్షులు పెదిరిపాటి మురళి గౌడ్, గుంటి చరణ్, యూత్ అధ్యక్షుడు జీవీపీ సాగర్, శివ గౌడ్, మాడపతి నరేంద్ర, రాహుల్, శ్రీకాంత్, మహేష్, అశోక్, భాస్కర్, సత్యనారాయణ, భారత్, వేణు, జైకృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# హైదర్షాకోట్ జెడ్పీహెచ్ఎస్‌లో 100 మంది విద్యార్థులకు హెచ్‌పీవీ టీకాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్షాకోట్ జెడ్పీహెచ్ఎస్, శ్రీనిధి స్కూరల్‌లో హెచ్‌పీవీ టీకాల కార్యక్రోమాన్ని విజయవంతంగా నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాకేష్ సూచలన మేరకు నార్సింగి యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మొత్తం 100 మంది విద్యార్థులకు హెచ్‌పీవీ టీకాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సంధ్యల ఆధ్వర్యంలో నిర్వహించగా డాక్టర్ అనూష్, డాక్టర్ గాయత్రి, సూపర్‌వైజర్ అమ్‌తుల్, ఏఎన్ఎంలు అమృత, స్వాతి, స్వప్న, ఆశా కార్యకర్త అరుణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. కార్యక్రమమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.కవిత, ఉపాధ్యాయులు రజిత, శ్రీనిధి స్కూల్ ప్రిన్సిపల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హిందూ పురాణాలను వక్రీకరించిన టీవీ రమణమూర్తి పై మీర్పేట్ పీఎస్ లో ఫిర్యాదు




Reception Centre Acknowledgement
Issue Authority
Name : BANDARIGALLA RAJITHA
Rank : PC
Contact the Below Officers for any Assistance
Office Number
Mobile Number
SHO

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) దైవ దూషణ మరియు హిందూ ఇతిహాసాల, పురాణాలను వక్రీకరణ చేసే వ్యాఖ్యలు చేసిన విజయ విహారం రమణ మూర్తి అలియాస్ టి రమణ మూర్తి పై మీర్పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన రాష్ట్రీయ హిందూ ధర్మ రక్షణ అధ్యక్షులు ఆంజనేయులు. దైవ దూషణ మరియు హిందూ దేవీ దేవతల పురాణాల, ఇతిహాసాల వక్రీకరణ చేస్తూ బయటికి మాత్రం హిందువులా నటిస్తూ చాపాకింద నీరులా హిందూ సమాజాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్న విజయ విహారం రమణ మూర్తి అలియాస్ తురగా రమణ మూర్తి పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేయడం జరిగిందని ఆంజనేయులు తెలిపారు



# సమతామూర్తి కేంద్రాన్ని సందర్శించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

భగవద్రామానుజుల బోధనలు నేటి సమాజానికి ఆదర్శనీయం

**గండిపేట, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గురువారం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ శ్రీరామనగరంలో కొలువుదీరిన సమతామూర్తి (రామానుజాచార్య) కేంద్రాన్ని సందర్శించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కూడా ఈ ఆధ్యాత్మిక పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు 216 అడుగుల భారీ రామానుజాచార్యుల వారి సువర్ణ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం త్రిదండి చినజీయర్ స్వామిని కలిసి మర్యాదపూర్వకంగా ఆశీర్వచనాలు తీసుకున్నారు. రామానుజా చార్యులు లోకానికి చాటిన సమతా భావం, ప్రాంగణంలోని 108 దివ్యదేశాల ప్రాముఖ్యత, కేంద్రం ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం తదితర విశేషాలను చినజీయర్ స్వామి గవర్నర్ దంపతులకు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ మాట్లాడుతూ.. కుల, మత, వర్గ భేదాలు లేకుండా మానవులంతా సమానమే అని వెయ్యేళ్ల క్రితమే విశ్వానికి చాటిచెప్పిన భగవద్రామానుజుల బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఇంతటి బృహత్తరమైన కేంద్రాన్ని నిర్మించి, భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందించడం ఎంతో అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు, పోలీసు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ 2047 లక్ష్యసాధనకు 1500 కోట్ల నిధులు అగ్రి వర్సిటీకి అవసరం ఉపకులపతి అల్దాస్ జానయ్య

అగ్రి వర్సిటీ దేశంలోనే మొదటి ర్యాంకు లో నిలవాలి - రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి ఆకాంక్ష

నిరంతర పరిశోధనలతో రైతాంగానికి చేరువ కావాలి - ఎంపీ ఈటల రాజేందర్

ఆహార భద్రతలో స్వయం సమృద్ధి సాధించాలి - తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు పిఎల్ విశ్వేశ్వరరావు

పిజెటిఎయు లో ఘనంగా జయశంకర్ జయంతి ఉత్సవాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి ఉత్సవాలని పిజెటిఎయు ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యసాధనలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషించనుందని ఆయనన్నారు. ఈ రంగ అభివృద్ధిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఇతర పరిశోధనలను చేపట్టాలంటే కృత్రిమ మేదస్సు వినియోగానికి అవసరమైన మానవ వనరులు, మౌలిక వసతుల కల్పనకు విశ్వవిద్యాలయం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఈ ప్రణాళికల అమలుకి సుమారు 1500 కోట్ల రూపాయల నిధులు అవసరమని జానయ్య అభిప్రాయపడ్డారు. ఈ నిధుల సమీకరణ కోసం నాబార్డ్ ద్వారా 850 కోట్ల రూపాయల ప్రత్యేక నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశామన్నారు. ఈ ప్రతిపాదనల ప్రతిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి కి ఉపకులపతి అందించి సహకరించవలసిందిగా కోరారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి 465 కోట్ల ప్రత్యేక సాయం కోసం మరో ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని అల్దాస్ జానయ్య తెలిపారు. ఆ ప్రతిపాదన ప్రతిని గౌరవ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి అందించి తోడ్పాటు అందించవలసిందిగా ఉపకులపతి కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సాధన కోసం జయశంకర్ చేసిన కృషి అసమానమన్నారు. ఆయన ఆశయాలు అయిన నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం మనమందరం కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థిగా ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిరంతరం సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ విశ్వవిద్యాలయం లో 70 శాతం అమ్మాయిలు విద్యను అభ్యసించడం ఆహ్వానించదగినదన్నారు. విద్యా ప్రమాణాలు ఇంకా మెరుగుపరుచుకొని, ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోని ప్రథమ స్థానంలో నిలవాలని చిన్నారెడ్డి ఆకాంక్షించారు. మూడు తరాల ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన జయశంకర్ కోరుకున్న తెలంగాణ నేడు కాస్త ఒడిదుడుకులతో పయనిస్తుందని ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించిన మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. అన్ని వర్గాల తెలంగాణ సాధన జయశంకర్ లక్ష్యమనీ, అందుకు మనమందరమూ కృషి చేయాలన్నారు. వ్యవసాయం అనేది సమాజానికి గుండెకాయ లాంటిదన్నారు. అశేష ప్రజానీకానికి సేవలందించి అందరికీ అన్నం పెట్టే ఈ వ్యవసాయ రంగానికి మరింత తోడ్పాటు అందించాల్సి ఉందన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన వంగడాలు అనేకం అద్భుత ఆదరణ పొందాయని రాజేందర్ పేర్కొన్నారు. నిరంతర పరిశోధనలు చేస్తూ వాటిని రైతాంగం వద్దకి తీసుకెళ్లాలని ఆయన శాస్త్రవేత్తలకి సూచించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తాను ఎల్లపుడు తోడ్పడతానని రాజేందర్ హామీ ఇచ్చారు. తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు పిజెటిఎయు లో తొలి జయశంకర్ స్మారకోపన్యాసం ఇచ్చారు. సమ్మిళిత, సమాన అభివృద్ధిని జయశంకర్ కోరుకున్నారని ఆయన వివరించారు. తెలంగాణ సాధన కోసం ఆయన దేశంలోని అన్ని వేదికల్లోనూ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. వాతావరణ మార్పులు, రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం తదితరాల వల్ల ఎదురవుతున్న సవాళ్లని అధిగమించడానికి విశ్వవిద్యాలయాలు కృషి చేయాలన్నారు. నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీలు, వంగడాలని సన్న, చిన్న కారు, మధ్యతరగతి రైతాంగానికి అందుబాటులోకి తీసుకురావడానికి విశ్వవిద్యాలయం పనిచేయాలని విశ్వేశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు గత రెండేళ్లుగా ఉపకులపతి చేపట్టిన సంస్కరణలని వివరించారు. విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల అంశాలను పరిష్కరించడానికి సహకరించవలసిందిగా అతిథుల్ని కోరారు. అనంతరం అతిథుల్ని విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ సి.హెచ్. వేణుగోపాల రెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## వ్యవసాయ యూనివర్సిటీలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 92వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌తో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హజరై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ స్ఫూర్తినిచ్చిన దార్శనికుని స్మరణ తెలంగాణ ఉద్యమం పట్ల ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అచంచలమైన అంకితభావాన్ని, విద్య, సామాజిక న్యాయం, ప్రజా సేవ పట్ల ఆయన జీవితకాల నిబద్ధతను గౌరవిస్తూ, మెరుగైన తెలంగాణ దిశగా మన సామూహిక ప్రయాణంలో ఆయన దార్శనికత మనందరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## హుడా కాలనీలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరణలి

రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని హుడా కాలనీలో బోనాల ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ తీర్థప్రసాదం స్వీకరించి భక్తులకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తీగల శివకుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన, విందు భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. బోనాల పండుగను ప్రజలు ఐకమత్యంతో, సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భోలేనాథ్ శేఖర్ గౌడ్, బుల్లెట్ రాజు గౌడ్, తీగల రమణ ముదిరాజ్, సాంబార్ శివ ముదిరాజ్, సీనియర్ నాయకుడు గణేష్ గుప్తా, మాజీ నర్సింగ్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, శంషాబాద్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కర్ణాకర్ గౌడ్, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, మీసేవ భాస్కర్, సురేష్ ముదిరాజ్, పారేపల్లె శ్రీనివాస్ గౌడ్, మేకల వెంకటేష్ ముదిరాజ్, లక్ష్మయ్య, సిద్ధేశ్వర్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, మహేందర్ ముదిరాజ్, తీగల సాయి ముదిరాజ్, సయ్యద్ బాబా, శ్రీకాంత్ గౌడ్, విజయ్ చౌహాన్, ఎండి అజీమ్, భాస్కర్ రెడ్డి, జంగీర్, వినయ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ్‌చందర్ రావుకు ఘన స్వాగతం

శంషాబాద్ విమానాశ్రయంలో పార్టీ శ్రేణుల ఆత్మీయ ఆహ్వానం



గండిపేట(క్రైమ్ మిర్రర్): అమెరికాలో నిర్వహించిన తెలుగు మహాసభల్లో పాల్గొని పర్యటన ముగించుకుని గురువారం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ్‌చందర్ రావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో నాయకులు పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా అభినందించారు. అమెరికాలో తెలుగు మహాసభల్లో పాల్గొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారగూడెం మల్లారెడ్డి, పొన్నమోని మల్లేష్ యాదవ్, సాబాధ విజయ్ కుమార్, చేడం వెంకటరమణ గుప్తా, కొత్త సోల్కర్ రెడ్డి, శేఖర్, రామారావు, సాయి స్నేహిత్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు.

## జీహెచ్ఎంసీ పరిధిలోని దేవాలయాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

బీఆర్ఎస్ నాయకుడు రావులకోళ్ల నాగరాజ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జీహెచ్ఎంసీ పరిధిలోని 121, 122, 123 డివిజన్లలో ఉన్న అన్ని హిందూ దేవాలయాలకు లైటింగ్, సౌండ్ సిస్టమ్, పూల అలంకరణ, టెంట్లు తదితర మౌలిక సదుపాయాలను జీహెచ్ఎంసీ తరఫున ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ బండ్లగూడ--రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి దేవాలయానికి ఈ తరహా ఏర్పాట్లు చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా ప్రజాపాలనలో భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హిందూ దేవాలయాల పట్ల సమాన దృష్టితో వ్యవహరిస్తూ, 121, 122, 123 డివిజన్లలోని ఆలయాలకు అవసరమైన మౌలిక వసతులను తక్షణమే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి లైటింగ్, సౌండ్ సిస్టమ్, పూల అలంకరణ, టెంట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఈ మేరకు 121, 122, 123 డివిజన్ల ప్రజల తరఫున జీహెచ్ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు రావులకోళ్ల నాగరాజ్ తెలిపారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె.జయశంకర్ సార్ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన దిశానిర్దేశం, నిబద్ధత, త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మల్లయ్య ఆయా విభాలకు చెందిన అధికారుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.